ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం

- రూ.82 లక్షలు దాటిన మాల్ పశువుల సంత నిర్వహణ వేలం
- శాశ్వత స్థలం, సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు

మాల్ పశువుల సంతకు ఆదాయం దండిగా ఉన్నా సౌకర్యాల కల్పన కొరవడింది. దీంతో అక్కడికి క్రయవిక్రయాల కోసం వచ్చే వ్యాపారులు, రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.


ఎండలో ఉన్న ఆవు, దూడ


మాల్ సంతలో క్రయవిక్రయాలు

యాచారం: మాల్ పశువుల సంతకు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు చెందిన రైతులు, పశు పోషకులు ఈ సంతకు వచ్చి పాడిపశువులు, గొర్రెలు, మేకలు తదితర జీవాల క్రయవిక్రయాలు జరుపుతుంటారు. ప్రతి మంగళవారం నిర్వహించే అంగడిలో దాదాపు 500 మందికి పైగానే వ్యాపారులు జీవనోపాధి పొందుతారు. ఈ పరిణామాలతో పశువుల సంత నిర్వహణ వేలంకు భలే డిమాండ్ ఏర్పడింది. రూ.లక్షలు వెచ్చించి మరి వ్యాపారులు పోటీ పడుతున్నారు. దీంతో గ్రామ పంచాయతీకి గణనీయంగా ఆదాయం సమకూరుతోంది.

పెరిగిన రూ.29 లక్షలు

వేలంలో సంత బాధ్యతలు దక్కించుకున్న వ్యాపారులు ఏడాది పాటు నిర్వహణ చేపట్టాలి. అంగడిలో క్రయ, విక్రయాలకు వచ్చే పాడి, పశువులు, ఎద్దులు, ఆవులు, గొర్రెలు, మేకలకు రూ.100 నుంచి 500ల వరకు నిర్వహణ చార్జీలు వసూల్ చేస్తారు. ఐదేళ్లలో ఆదాయం బాగా పెరిగింది. ఇది వరకు రూ.53 లక్షలున్న ఆదాయం ఈ ఏడాది రూ.82 లక్షలు దాటింది. ఈ సంత నిర్వహణతో వచ్చే ఆర్థిక వనరులతో గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం, పంచాయతీ సిబ్బందికి జీతాలు చెల్లిస్తారు.

ప్రైవేట్ వెంచర్‌లో నిర్వహణ

మాల్ పశువుల సంతకు గణనీయమైన ఆదాయమున్నా సరైన సౌకర్యాల కొరత మాత్రం వేధిస్తోంది. ప్రతి ఏడాది రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా అంగడి నిర్వహణకు శాశ్వత స్థలం లేదు. గతంలోని పంచాయతీ పాలకవర్గం సంతకు ఎకరా స్థలాన్ని కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆ జాగ చుట్టూ నివాసాలు వెలియడంతో సంత నిర్వహణ కష్టంగా మారింది. దీంతో ప్రైవేట్ వెంచర్లలో అంగడిని నిర్వహిస్తున్నారు. మాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 647లో 16 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 5 ఎకరాలను సంతకు కేటాయించాలని కొన్నేళ్లుగా స్థానికులు ప్రాధేయపడుతున్నా అధికారుల్లో చలనం లేదు. వెంచర్లలో ఏటా ఇంటి నిర్మాణాలతో సంత నిర్వహణ పంచాయతీకి భారంగానే మారే అవకాశం లేకపోలేదు.

ఐదేళ్లలో వేలం ద్వారా వచ్చిన ఆదాయం

ఏడాది	రూ.లక్షల్లో
2021–22	రూ.53
2022–23	రూ.59
2023–24	రూ.71
2024–25	రూ.73
2025–26	రూ.82

ఎండ, వానకు ఇబ్బంది



మాల్ పశువుల సంతకు ప్రతి మంగళవారం వెళ్తుంటాను. అక్కడ సౌకర్యాలు లేవు. ఎండ, వానకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. రైతుల వద్ద పశువులు, పాడి గేదెలు, మేకలు, గొర్రెలు కొనుగోలు చేసి సంతలో విక్రయిస్తాను. కానీ అక్కడ సౌకర్యాలు లేకపోవడంతో పశువులు గోస తీస్తాయి.

– మల్లేశ్, వ్యాపారి, మొండిగౌరెల్లి

శాశ్వత స్థలం లేదు



ఉమ్మడి రంగారెడ్డి–నల్గొండ జిల్లాల్లో మాల్ పశువుల సంతకు పేరుంది. ఇక్కడ అనువైన ధరలకు అరకదున్నె ఎద్దులు, కాడెద్దులు, పాడి పశువులు క్రయ, విక్రయాలు జరుపుతారు. గణనీయమైన ఆదాయం పెరుగుతున్నా శాశ్వత స్థలం లేకపోవడంతో నిర్వహణదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– రాంరెడ్డి, రైతు, తమ్మలోనిగూడ

నివేదిక అందజేశాం



మాల్ పశువుల సంతకు శాశ్వత స్థలం కేటాయింపు కోసం సర్వేనంబరు 647లోని 16 ఎకరాల ప్రభుత్వ భూమిలో 5 ఎకరాల కేటాయించేలా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. ఐదు ఎకరాలు కేటాయిస్తే పశువుల సంతతో పాటు చేపలు, చికెన్, మటన్ మార్కెట్లు ఏర్పాటు చేస్తాం.

– శ్రీలత, ఎంపీఓ, యాచారం

క్లుప్తంగా

మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర మంత్రి వర్గంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి చోటు కల్పించాలని పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కంచర్ల సత్యనారాయణరెడ్డి కోరారు. పెద్దఅంబర్‌పేటలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉగాదికి మంత్రి వర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో ఈసారి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి తప్పకుండా ఇవ్వాలని, ఈ విషయంలో ఏఐసీసీ తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే రంగారెడ్డికి మంత్రి పదవి ఇస్తే జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తారని సూచించారు.

బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడికి సత్కారం


నరేందర్‌రావుతో స్థానిక బీజేపీ నాయకులు

ఆమనగల్లు: బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వేముల నరేందర్‌రావును ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయాన్ని తొలిసారిగా సందర్శించిన ఆయనకు శాలువా కప్పి, పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు యాదగిరి, రవిరాథోడ్, పద్మ ప్రశాంత్, సాయికుమార్, దేవేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా నీరు సరఫరా చేయాలని వినతి


జలమండలి జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తుర్కయంజాల్: జీహెచ్‌ఎంసీలో మాదిరిగా తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోనూ ఒక్కో ఇంటికి నెలకు 20వేల లీటర్ల మంచినీటిని ఉచితంగా సరఫరా చేయాలని బీజేపీ నాయకులు మంగళవారం జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జీఓ 211 ప్రకారం వెంటనే మున్సిపాలిటీలో అమలు చేయాలని వారు కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారి బచ్చిగళ్ల రమేశ్, రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు బల్‌దేవ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మాటల వక్రీకరణపై ఫిర్యాదు


సీఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం: ప్రధాని మోదీ పార్లమెంట్‌లో ప్రసంగించిన మాటలను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి వక్రీకరించిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్‌కు బీజేపీ నేతలు మంగళవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌చారి, సత్యనారాయణ, విజయ్‌కుమార్, శేఖర్, బాలశివుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌కు బెస్ట్ అవార్డు


అవార్డు అందజేస్తున్న ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో ఉన్న శ్రీనివాస హై స్కూల్ యాజమాన్యానికి అవార్డు దక్కింది. మంగళవారం నగరంలోని బిర్లా ప్లానిటోరియంలో నిర్వహించిన తెలుగురత్న అవార్డు కార్యక్రమంలో భాగంగా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్న శ్రీనివాస హై స్కూల్‌కు యాదగిరిగుట్ట ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు పురస్కారం అందజేశారు. అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- అడ్వకేట్ హత్యపై భగ్గుమన్న బార్ అసోసియేషన్
- ఆమనగల్లులో న్యాయవాదుల నిరసన


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: హైదరాబాద్‌లో ప్రముఖ న్యాయవాది ఇజ్రాయెల్‌ను హత్యచేసిన నిందితుడిని ఉరి తీయాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్ డిమాండ్ చేశారు. న్యాయవాది ఇజ్రాయెల్‌ను కత్తితో పొడిచి అతి కిరాతకంగా చంపిన నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు వెంటనే విచారణ జరిపి శిక్షించాలని కోరారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలో న్యాయవాదులు ప్లకార్డులు పట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్, ఆంజనేయులుయాదవ్ మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్‌యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదిని హత్యచేసిన నిందితుడికి ఉరిశిక్ష పడేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామకృష్ణ, శేఖర్, మధు, మల్లేశ్, జగన్‌గౌడ్, గణేశ్, సంతోష్, కృష్ణ, మల్లేశ్, శిరీష్, బిక్కునాయక్, మురళీకృష్ణ, నరేందర్, సర్దార్, మల్లేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ న్యాయవాది యాదీలాల్ కోరారు. న్యాయవాది ఇజ్రాయెల్ హత్యను ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం మహేశ్వరం మండలం తుమ్మలూర్‌లో మృతదేహానికి యాదీలాల్ నివాళులు అర్పించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రజనీసాయిచంద్ తదితరులు

కడ్తాల్: ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజనీసాయిచంద్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ పండుగ జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ప్రార్థించారు. అంతకు మసీద్ ఇమామ్ మౌలానా జహీరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, అజ్గర్‌అలీ, ఈర్షాద్, దాసు, రవూఫ్, హైమాద్ జానీ, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న యుగేందర్‌గౌడ్

కందుకూరు: మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ కృషితో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యాయని మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందూరి యుగేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దాసర్లపల్లిలో రూ.5లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామస్తుల తరపున కేఎల్‌ఆర్‌తో పాటు ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మీగడి శేఖర్, యాదయ్య, బాల్‌రాజ్, విష్ణు, వెంకటేశ్ పాల్గొన్నారు.

దుర్వాసన భరించలేం

చనిపోయిన చేపలు తొలగించాలని వినతి


తూములో చనిపోయిన చేపలు చూపిస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు తూములో మృతి చెందిన చేపల దుర్వాసన భరించలేకపోతున్నామని మంగళవారం శ్రీరంగాపురం, సాయినాథ్ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని రోజులుగా చేపలు చనిపోయి దుర్వాసన వ్యాప్తిస్తోందని దీంతో చుట్టు పక్కల కాలనీల్లో నివసించే వారికి ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు వంశీధర్‌రెడ్డి, కాలనీవాసులు మల్లారెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై ఫిర్యాదు


కేంద్ర మంత్రిపై ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇబ్రహీంపట్నం పోలీసులకు బీఆర్‌ఎస్ శ్రేణులు మంగళవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాజ్‌కుమార్, కరుణాకర్, రాజేందర్‌రెడ్డి, ఐలేశ్, శేఖర్‌గౌడ్, శ్రీకాంత్, కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ


కేక్ కట్‌చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: పట్టణంలో మంగళవారం టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డిని అభిమానులు గజమాలతో సత్కరించారు. అనంతరం కాంగ్రెస్ నాయకుల సమక్షంలో కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, మానయ్య, రాజశేఖర్, సత్యం, రాఘవేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమిపై సమీక్ష

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు సమావేశమై వివిధ నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చే నెల 6న నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. అనంతరం సభ్యుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. సమావేశంలో యాదగిరి, వెంకటయ్య, రాములు, యాదయ్య, రవీందర్, రమేశ్, ఆంజనేయులుయాదవ్, పరమేశ్‌గౌడ్, గోపాలకృష్ణ, పూజారి వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

ఆమనగల్లు: తలకొండపల్లి యాదవ సంఘం అధ్యక్షుడిగా రవీందర్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన యాదవసంఘం సమావేశంలో మాజీ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా రవీందర్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా మల్లేశ్‌యాదవ్, కార్యదర్శిగా మల్లేశ్, సభ్యులుగా వెంకటేశ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మహేశ్, వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు.

మసీద్ నిర్మాణ పనులు ప్రారంభం

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం దర్గా వద్ద మసీద్ నిర్మాణ పనులను మత పెద్దలు ఎండీ రషీద్, ఎండీ మదర్‌సాబ్, ఎండీ జహంగీర్ ప్రార్థనలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కె.శ్రీశైలం, చెన్నయ్య, థామస్‌రెడ్డి, డి.శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆచారికి అధ్యక్ష పదవి రావాలి

మైసిగండి మైసమ్మ ఆలయంలో బీజేపీ నాయకుల పూజలు


ఆచారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలని పూజలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

కడ్తాల్: భారతీయ జనతా పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడైన తల్లోజు ఆచారిని నియమించాలని ఆ పార్టీ కల్వకుర్తి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల నేతగా, పార్టీ సిద్ధాంతాలను పాటిస్తున్న ఆచారికి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యేగా ఆరు సార్లు స్వల్ప తేడాతో ఓటమి చెందినా, పార్టీ మారకుండా పనిచేసిన చరిత్ర ఆయనది అన్నారు. అనంతరం ఆచారి చిత్రపటానికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్‌దోనాదుల, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీశైలంగౌడ్ నాయకులు మాన్యనాయక్, రాందాస్‌నాయక్, వెంకటేశ్‌యాదవ్, నరేశ్‌గౌడ్, రెడ్యా, సాయిప్రభు, బల్వంత్‌రెడ్డి, అనిల్‌చారి, మల్లేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు పార్టీకి ప్రజల నుంచి అనూహ్య ఆదరణ లభిస్తోందని తెలిపారు. పార్టీని మారుమూల తండాలు, పల్లెల్లో బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నిధుల మంజూరుపై హర్షం


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయకులు

మాడ్గుల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ స్థాయిని పెంచుతూ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మంగళవారం మాడ్గుల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచుతూ నూతన భవనం నిర్మాణం, యంత్ర సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం రూ.12.70 కోట్లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఓంప్రకాశ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్వామివారి కల్యాణోత్సవం


వేంకటేశ్వరస్వామి సేవలో నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మండలం పరిధిలోని కప్పపహాడ్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు టీపీసీసీ సభ్యుడు, ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వీరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సతీష్, మార్కెట్ డైరెక్టర్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.